# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
4-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 44

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# తెలంగాణ బిజెపికి ఏమైంది?!




తెలంగాణ బిజెపిలో సమన్వయం కొరవడుతోందా? నేతల మధ్య విభేదాలు పార్టీపై ప్రభావం చూపుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. తాజాగా ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన పుణ్యమా అని నేతల మధ్య సమన్వయ లోపం వెలుగులోకి వచ్చింది. ప్రధాని పర్యటనకు సంబంధించిన సభ నామకరణం మార్పు ఇప్పుడు రచ్చకు దారితీస్తోంది.

2లో


## ప్రధాని పర్యటన సభ పేరు మార్పు

## నేతల మధ్య సమన్వయ లోపం

## కేడర్లో అయోమయం



క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో : ఇప్పటివరకు ప్రధాని పాల్గొనే సభకు జనాగ్రహ సభ అని పెట్టాలని నిర్ణయించారు. కానీ కొంతమంది నేతల అభ్యంతరాలతో ప్రధాని పర్యటన సభగా మార్చి చర్చకు కారణం అయ్యారు. జనాగ్రహ సభ పేరు మార్పు..



# బీఆర్ఎస్, టిడిపి దోస్తీ?!

ఏపీ సీఎం చంద్రబాబుతో కెసిఆర్ జత కడుతున్నారా? తెలంగాణలో టిడిపి క్యాడర్, అభిమానులను టర్న్ చేసుకునే పనిలో ఉన్నారా? టిడిపి తో గులాబీ పార్టీ పొత్తు పెట్టుకుంటుంది? పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది. పరస్పర రాజకీయ ప్రయోజనాలతో ఆ రెండు పార్టీలు చేతులు కలుపుతాయన్న ప్రచారం జరుగుతోంది.

## చంద్రబాబుతో చేతులు కలిపేందుకు కేసిఆర్ సిద్ధం

## టిడిపి క్యాడర్, అభిమానులను తిప్పుకునేందుకు ప్రయత్నం

## తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో కొత్త చర్చ

2లో

# అధికారం ఎవరిని వరించేనో!..

## అందరి చూపు బెంగాల్ పైనే!

## ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

## బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి కౌంటింగ్ నేడే

## ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రారంభం



న్యూఢిల్లీ, మే 3: టీఎంసీ, డీఎంకే వంటి ప్రాంతీయ పార్టీలతోపాటు బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలకు ఫలితం కీలకంగా మారిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనున్నది. మూడు అంచెల భద్రత వ్యవస్థ కలిగిన లెక్కింపు కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. తొలిసారిగా కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార ప్రవేశాన్ని నివారించడానికి ఎన్నికల సంఘం ఈసీఐఎన్ఈటీ ద్వారా క్యూర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు వ్యవస్థను ప్రవేశపెట్టింది. పశ్చిమ బెంగాల్‌లోని 293 అసెంబ్లీ స్థానాలకు 77 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఈసారి ఊహించని రీతిలో భద్రతా ఏర్పాట్లు జరిగాయి.

4లో

# అందరి దృష్టి రోజా పైనే!

## నేడు తమిళనాడు ఎన్నికల ఫలితాలు

## డీఎంకేకు ప్రతికూల ఫలితాలు వస్తే ఐరన్ లెగ్ ముద్ర ఖాయం

**క్రైమ్ మిర్రర్, ఎలక్షన్ డెస్క్:** తమిళనాడు ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సోమవారం జరగనుంది.. అయితే అందరి దృష్టి తమిళనాడు పైనే ఉంది. ఎన్నికల ముందు వరకు అక్కడ అధికార డిఎంకె కూటమి ముందు



# బిజెపికి మల్లారెడ్డి షరతు!

## కోడలుకు ఎంపీ సీటు.. తనతో పాటు కుటుంబ సభ్యులకు ఐదు ఎమ్మెల్యే సీట్లు

## ఎటూ చెప్పని కమలం హై కమాండ్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** మాజీ మంత్రి మల్లారెడ్డి భారీ స్కెచ్ వేశారా? బిజెపికి భారీ ఆఫర్ పెట్టారా? ఏకంగా ఫ్యామిలీ ప్యాకేజ్ కావాలని కోరారా?



2లో



# ఏపీలో కొత్త రాజకీయ పార్టీ?!

## సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సన్నాహాలు

## దళితుల కు రాజ్యాధికారమే లక్ష్యం

## అంబేద్కర్ ఇండియన్ మిషన్ లో పది లక్షల మంది సభ్యులు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో మరో రాజకీయ పార్టీ రాబోతుందా? సీనియర్ ఐపీఎస్ అధికారి పివి సునీల్ కుమార్ కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నారా?

5లో

# ఉద్యోగులతో ప్రభుత్వం రాజీ!

## ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

## వారి సమస్యలపై సానుకూలత

## ఈనెల 5న భారీ ఆందోళన కార్యక్రమం నిలిపివేత



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టారు సీఎం రేవంత్ రెడ్డి. ఇటీవల ఆర్టీసీ కార్మికుల సమ్మె, డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మార్పణ, ఉద్యోగ సంఘాల నుంచి వస్తున్న డిమాండ్లు వంటి కారణాలతో ప్రభుత్వం పై



2లో

# వైసీపీ వైపు.. ఆ ముగ్గురు చూపు!

## ఎన్నికల ఫలితాలు తర్వాత కూటమిలో చేరిక

## పునర్విభజనతో రాజకీయ భవిష్యత్తుకు హామీ

## ఇప్పుడు పట్టించుకోకపోవడంతో మాతృ పార్టీ వైపు


క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో : టిడిపిలో చేరిన ఆ వైసీపీ మాజీ మంత్రులు యూటర్న్ తీసుకుంటున్నారా? తిరిగి వైసీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారా?

# టిడిపిలోకి కేశినేని నాని?!

## చంద్రబాబుకు పెద్దల ద్వారా విన్నపం

## విజయవాడ మేయర్ గా కుమార్తెకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

## అధినేత గ్రీన్ సిగ్నల్



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** విజయవాడ మాజీ ఎంపీ కేసినేని నాని పొలిటికల్ రీఎంట్రీ ఉంటుందా?

# తెలంగాణ బిజెపికి ఏమైంది?!

కాంగ్రెస్ ప్రభుత్వం పై దూకుడుగా ముందుకు వెళితేనే వచ్చే ఎన్నికల్లో బిజెపికి తెలంగాణ చిక్కుతుందన్నది మెజారిటీ నేతల అభిప్రాయం. అయితే ప్రధాని నరేంద్ర మోడీ దాదాపు 8 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించి శ్రీకారం చుట్ట నున్నారు. అటువంటి సభకు జనాగ్రహ సభ అని నెగిటివ్ అర్థం వచ్చేలా పేరు పెట్టడం అంత సహాయకం కాదు అనేది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లాంటి వారి అభిప్రాయం. అయితే ఒకసారి పేరు పెట్టాక దాని మార్పుతో ప్రతికూల ప్రభావం చూపుతుంది అనేది తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అభిప్రాయం. ఈ సభ నిర్వహణతో పాటు పేరు ఖరారు విషయంలో ఇద్దరు నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అయితే ఈ సభ ద్వారా తెలంగాణ లో బిజెపి సత్తా చూపాలని పార్టీ శ్రేణులు కోరుతూ వచ్చాయి. కానీ నేతల మధ్య అభిప్రాయ బేధాలు పార్టీ క్యాడర్లో ఒక రకమైన గందరగోళానికి కారణం అవుతున్నాయి.

**తొలిసారిగా తెలంగాణకు మోడీ..**

నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని అయిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారు. త్వరలో గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో దాదాపు 8 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. గ్రేటర్ను బిజెపి వైపు టర్న్ చెయ్యాలన్నది ప్రధాని నరేంద్ర మోడీ టూర్ ప్లాన్. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యం చేసుకోవాలన్నది ప్రణాళిక. అయితే తెలంగాణ నేతలకు ఎన్నిసార్లు దిశా నిర్దేశం చేస్తున్నా వారి వైఖరిలో మార్పు రావడం లేదు. ఇప్పటికే నేతల మధ్య అభిప్రాయ భేదాలు పతాక స్థాయికి చేరాయి. కేంద్రమంత్రి బండి సంజయ్ వర్సెస్ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నట్టు పరిస్థితి ఉంది. గ్రేటర్లో తాము ప్రతిపాదించిన వారికే కార్పొరేటర్ టిక్కెట్లు ఇవ్వాలని ఈటెల రాజేందర్ వంటి నేతలు డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో నేతల మధ్య గట్టిగానే వారు కొనసాగుతోంది. పరస్పరం వ్యతిరేక ప్రచారం చేసుకుంటున్నారు. అయితే అత్యంత ప్రాధాన్యత అంశంగా భావించే ప్రధాని నరేంద్ర మోడీ టూర్ ను కూడా నేతలు సీరియస్ గా తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# బీఆర్ఎస్, టిడిపి దోస్తీ?!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** రాజకీయ అవసరాలు..రాజకీయాల్లో అవసరాలు మాత్రమే పనిచేస్తాయి. అవసరం అనుకుంటే ఎంత దాకైనా తీసుకెళ్తాయి రాజకీయాలు. ఇప్పుడు అటువంటి పరిస్థితి తెలంగాణలో కేసిఆర్ కు ఏర్పడింది. తెలంగాణ సాధకుడిగా కెసిఆర్ ను అక్కడి ప్రజలు గుర్తించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కంటే కేసీఆర్ గులాబీ పార్టీకి ప్రాధాన్యం ఇచ్చారు. తొలి రెండుసార్లు అధికారం ఇచ్చారు. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం తమ తీర్పు మార్చారు. కాంగ్రెస్ పార్టీని అందలం ఎక్కించారు. అదే సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లో ఛాన్స్ ఇచ్చారు. అయితే రెండు జాతీయ పార్టీల దూకుడుతో గులాబీ పార్టీ బేజారు అయ్యింది. సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా రాకపోవడంతో డీలా పడింది. అప్పటినుంచి సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూనే ఉంది.

**మెజారిటీ నేతలు టిడిపి వారే..**

ఉద్యమ తెలంగాణ సమయంలో దూకుడుగా ఉండేది గులాబీ పార్టీ. తెలంగాణ రాష్ట్ర సమితిగా ఆవిర్భవించి సుదీర్ఘకాలం తెలంగాణ ఉద్యమంలో ఉంది ఆ పార్టీ. అయితే క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి అనుకున్నంత పట్టులేదు. కానీ రాష్ట్ర విభజనతో తెలంగాణ తెచ్చిన పార్టీగా ప్రజలు గుర్తించి మెజారిటీ కట్టబెట్టారు. అదే సమయంలో



ప్రతిపక్షాలను సైతం 2014లో ఆదరించారు. కాంగ్రెస్ తో పాటు టిడిపిని కూడా గెలిపించారు. అయితే అదే పరిస్థితి కొనసాగితే గులాబీ పార్టీకి పట్టు దొరకదు అని భావించారు కెసిఆర్. అందుకే బంగారు తెలంగాణ పేరుతో తెలుగుదేశం పార్టీని కబళించారు. పెద్ద ఎత్తున ఆ పార్టీ నుంచి నేతలను ఆకర్షించగలిగారు. 2018 ఎన్నికల నాటికి పూర్తిగా తెలుగుదేశం ను నిర్వీర్యం చేశారు తెలంగాణలో కేసీఆర్.

**పూర్వాశ్రమం టిడిపి..**

ప్రస్తుతం గులాబీ బాస్ కెసిఆర్ నుంచి దిగువ స్థాయి కేడర్ వరకు.. అంతటినీ పరిశీలిస్తే నేతల పూర్వాశ్రమం తెలుగుదేశం. అందుకే మొన్నటి జగిత్యాల సభను బిజెపి ఎంపీ ధర్మపురి అరవింద్ ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పూర్వ విద్యార్థుల సభతో పోల్చారు. ప్రస్తుతం కెసిఆర్ పార్టీలో ఉన్న నేతలు 80 శాతం మంది తెలుగుదేశం వారే. అయితే టిడిపిని పూర్తిగా కబళించాలన్న ఉద్దేశంతో.. ఆ పార్టీని తెలంగాణలో లేకుండా చేయాలన్న లక్ష్యంతో పని చేశారు కేసీఆర్. నేతలను అయితే ఆకర్షించారు కానీ.. టిడిపి అభిమానులను, ఓటర్లను ఆకర్షించలేకపోయారు. అలా వారు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి టర్న్ అయ్యారు. రేవంత్ రెడ్డి పూర్వపు టిడిపి నేత కావడం.. కెసిఆర్ తెలుగుదేశం పార్టీని సర్వనాశనం చేయడంతో వారంతా కాంగ్రెస్ వైపు టర్న్ తీసుకున్నారు. అదే ఇప్పుడు గులాబీ పార్టీకి ఇబ్బంది కలిగించే విషయం.. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో గులాబీ పార్టీకి ఉన్న బలానికి తోడు టిడిపి క్యాడర్ తో పాటు అభిమానులు గులాబీ పార్టీ వైపు వస్తే మరోసారి ఆ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయం. అందుకే చంద్రబాబుతో కేసిఆర్ అండ్ కో స్నేహం చేసేందుకు ప్రయత్నం చేస్తుందని తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఒక చర్చ నడుస్తోంది. బిజెపితో జనసేన జత కలిసి ఒక కూటమిగాను.. టిడిపి తో గులాబీ పార్టీ జతకలిసి మరోకూటమిగాను పోటీ చేసి.. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత అంతా భాగస్వామ్య ప్రభుత్వం నడిపించాలన్నది ఒక ప్రణాళికగా తెలుస్తోంది. అప్పుడే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ధీటుగా ఎదుర్కోవచ్చు అనేది కెసిఆర్ ఆలోచనగా సమాచారం. ఆ దిశగా చంద్రబాబుతో కేసీఆర్ శిబిరం చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# టిడిపిలోకి కేశినేని నాని?!

తిరిగి ఆయన రాజకీయాలు మొదలుపెట్టనున్నారా? తెలుగుదేశం పార్టీలో చేరుతారా? చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. విజయవాడ పొలిటికల్ సర్కిల్స్లో కొత్త ప్రచారం మొదలైంది. మొన్నటి ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేశారు కేశినేని నాని. ఆ ఎన్నికల్లో సొంత సోదరుడు చిన్ని చేతిలో ఓడిపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం ఓడిపోవడంతో రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కేసినేని నాని తిరిగి టిడిపిలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

**రవాణా రంగంలో అగ్రగామిగా..**

ట్రాన్స్పోర్ట్ వ్యాపారంలో తనకంటూ ముద్ర చాటుకున్నారు కేసినేని నాని. కేశినేని ట్రావెల్స్ రూపంలో ఆయన సుపరిచితులు. అలా ప్రజారాజ్యం పార్టీలో చేరారు కేసినేని నాని. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి 2014 ఎన్నికల్లో తొలిసారిగా విజయవాడ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం వర్గానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేశారు. అలా విజయవాడ ప్రజల ఆదరణ పొందారు. 2019 ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో కేసినేని నాని గెలవడానికి అదే కారణం. అయితే రెండోసారి గెలిచేసరికి ఆయనలో ఒక రకమైన భావన ఏర్పడింది. అదంతా తన సొంత చరిష్మ అన్నట్టు ఆయన ప్రవర్తన ఉండేది. 2024 ఎన్నికల కు ముందు ఆయన అలక చెందారు. పార్టీ నాయకత్వం పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీకి గుడ్ బై చెప్పారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

**కూతురి రాజకీయ భవిష్యత్తు కోసం**

ప్రస్తుతం విజయవాడలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కేశినేని నాని తిరిగి టిడిపిలోకి ఎంట్రీ ఖాయమన్న ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే నాని తన మనసులో ఉన్న మాటను పెద్దల ద్వారా చంద్రబాబుకు చేరవేసినట్లు తెలుస్తోంది. వచ్చే నగరపాలక సంస్థ ఎన్నికల్లో తన కుమార్తెను మేయర్ అభ్యర్థిగా ప్రకటిస్తే.. తిరిగి మాతృ పార్టీలోకి వస్తానని నాని చెప్పినట్లు తెలుస్తోంది. గతంలో నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఆయన కుమార్తె మేయర్ అభ్యర్థిగా టిడిపి నుంచి రంగంలోకి దిగారు. ఇప్పుడు అదే విషయాన్ని గుర్తు చేస్తూ.. రాజకీయంగా నష్టపోయానని.. పాత సంగతులు అన్నీ మరిచి చేర్చుకుంటే టిడిపిలో చేరేందుకు సిద్ధమని కేసినేని నాని వర్తమానం పంపినట్లు తెలుస్తోంది. చంద్రబాబు సైతం దీనికి సానుకూలత వ్యక్తం చేసినట్లు ప్రచారం నడుస్తోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

**లోకేష్ విషయంలో అలా..**

చంద్రబాబు పట్ల విధేయత ప్రదర్శిస్తూ వచ్చారు కేసినేని నాని. కానీ కృష్ణా జిల్లా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సొంత పార్టీ నేతలు వ్యతిరేకులుగా మారిపోయారు. వారందరికీ లోకేష్ ప్రోత్సాహం ఉందని ఎక్కువగా అనుమానం చెందారు. ప్రధానంగా తన సోదరుడు చిన్ని వెనుక లోకేష్ ఉన్నారు అనేది నాని అభిప్రాయం. అలా అభద్రతాభావం లోకి వెళ్లిపోయిన కేసినేని నాని చంద్రబాబుకు గౌరవం ఇచ్చేవారు. కానీ లోకేష్ విషయంలో అది కనిపించేది కాదు. అయితే ఎన్నికలకు ముందు నాటకీయ పరిణామాలు జరగడంతో.. కేశినేని నాని టిడిపికి గుడ్ బై చెప్పారు. వైసీపీలో చేరి ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. తెలుగుదేశం పార్టీ గెలవడంతో తప్పు చేశానని భావించి క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకున్నారు. అయితే పరిస్థితులకు అనుగుణంగా మారారే తప్ప ఆయనకు టిడిపి అంటే చాలా అభిమానం. చంద్రబాబు అంటే కూడా గౌరవం.



# వైసీపీ వైపు.. ఆ ముగ్గురు చూపు!

(మొదటి పేజీ తరువాయి)

కూటమి పార్టీలో ప్రాధాన్యత లేకపోవడంతో తిరిగి మాతృ పార్టీ వైపు చూస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. కూటమి పార్టీల్లో తమకు ప్రాధాన్యత లేకపోవడంతో ఆ నేతలంతా పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. దాదాపు అందరి నేతలు అదే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. అయితే వారిని వైసిపి నాయకత్వం తిరిగి చేర్చుకుంటుందా? లేదా? అనేది కొత్త చర్చ.

**బాలినేని శ్రీనివాస్ రెడ్డి యూటర్న్..**

వైసిపి ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఆ జాబితాలో జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితులు, వైసీపీలో ఒక వెలుగు వెలిగిన నాయకులు ఉన్నారు. అటువంటి వారిలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఒకరు. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. ఆపై బంధువు కూడా. 2004లో రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చి రాణించారు బాలినేని. జగన్ వెంట నడిచి మంత్రి కూడా అయ్యారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అనివార్య పరిస్థితుల్లో ఆయన జనసేనలో చేరారు. కానీ ఆయన చేరికను ఒంగోలు టిడిపి ఎమ్మెల్యేతో పాటు జనసేన క్యాడర్ వ్యతిరేకిస్తోంది. ఇప్పటివరకు అధికారిక కార్యకలాపాలలో ఆయనకు చాన్స్ లేకుండా పోయింది. డీ లిమిటేషన్ తో కొత్త నియోజకవర్గంలో ఆయనకు పోటీ చేయించేందుకు



హామీ ఇచ్చారు పవన్. కానీ ఇప్పుడు 2029 ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన ఉండదని తేలిపోయింది. దీంతో డిఫెన్స్ లో పడిపోయారు బాలినేని. అయితే ఆయన తిరిగి వస్తే డోర్స్ క్లోజ్ అన్నట్టు ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి సంకేతాలు పంపారు. దీంతో ఏం చేయాలో బాలినేనికి పాలుపోవడం లేదు.

**ఆలోచనలో ఆళ్ల నాని..**

మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని పరిస్థితి అదే. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంత్రిగాను, డిప్యూటీ సీఎం గానూ ఛాన్స్ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. కానీ మొన్నటి ఎన్నికల్లో ఆయన ఏలూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఫలితాలు వచ్చిన తర్వాత ఆయన టిడిపిలో చేరారు. అయితే ఆయన చేరికను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది ఏలూరు టిడిపి క్యాడర్. కేవలం నియోజకవర్గాల పునర్విభజనతో అవకాశం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.. పార్టీలో చేరిన ఆళ్ల నానికి పెద్దగా ప్రాధాన్యం కూడా లేకుండా పోతోంది. అందుకే ఇప్పుడు మాతృ పార్టీ వైపు ఆయన ఆశగా ఎదురు చూస్తున్నట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ఆయన తిరిగి వైసిపిలో చేరడం ఖాయమన్న ప్రచారం నడుస్తోంది.

**అంతర్మధనంలో మోపిదేవి**

మరో మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ పరిస్థితి కూడా అలానే ఉంది. జగన్మోహన్ రెడ్డి తో పాటు అక్రమాస్తుల కేసుల్లో మోపిదేవి కూడా అరెస్టయ్యారు అప్పట్లో. అలా జగన్మోహన్ రెడ్డి తన పార్టీలో చేర్చుకున్నారు. 2014 ఎన్నికల్లో వైసీపీ టికెట్ ఇచ్చారు. ఓడిపోయిన మోపిదేవికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో మోపిదేవికి మంత్రిగా కూడా ఛాన్స్ ఇచ్చారు. తర్వాత రాజ్యసభ సభ్యుడిగా ప్రమోట్ చేశారు. 2024 ఎన్నికల్లో టికెట్ దక్కక పోయేసరికి కాస్త అసంతృప్తికి గురయ్యారు మోపిదేవి. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత వైసిపి ద్వారా వచ్చిన రాజ్యసభ పదవికి రాజీనామా చేసి మరి ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయనకు ఏడాదిన్నర దాటుతున్న ఎటువంటి పదవి దక్కలేదు. పైగా నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తనకు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని అంచనా వేసుకున్నారు. ఆ పరిస్థితి లేకపోగా టిడిపిలో ఎటువంటి ప్రాధాన్యత లేదు. అందుకే ఆయన తన మాతృ పార్టీ వైపు చూస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అయితే వైసీపీని వీడిన నేతల విషయంలో ఎన్నికల ముంగిట క్లారిటీ రానుంది. అప్పటివరకు వారు సర్దుబాటు చేసుకోవాల్సిందే.

# అందరి దృష్టి రోజా పైనే!

(మొదటి పేజీ తరువాయి)



వరసలో నిలిచింది. రెండోసారి అధికారం ఖాయమన్న ప్రచారం తెగ నడిచింది. కానీ పోలింగ్ ముగిసిన తరువాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు భిన్నంగా వచ్చాయి. అక్కడ హంగ్ తప్పదు అన్న సంకేతాలు ఇచ్చాయి మెజారిటీ సర్వేలు. దీంతో డిఎంకె శిబిరంలో ఒక రకమైన ఆందోళన ప్రారంభమైంది. అన్నింటికీ మించి ఇప్పుడు మాజీమంత్రి రోజాపై విస్తృత చర్చ నడుస్తోంది. ఒకవేళ డీఎంకే ఓడిపోతే మాత్రం రోజాపై ఐరన్ లెగ్ ముద్ర వేయడం ఖాయం.

**ఎన్నికల ప్రచారంలో రోజా..**

తమిళనాడు ఎన్నికల ప్రచారానికి గాను వైసీపీకి చెందిన మాజీ మంత్రి రోజా వెళ్లారు. ఆమెకు అక్కడ సీఎం స్టాలిన్ కుటుంబంతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఆమెను స్టాలిన్ సోదరితో భావిస్తారు. అందుకే స్టాలిన్ కోరిక మేరకు రోజా అక్కడ ప్రచారానికి వెళ్లారు. జగన్మోహన్ రెడ్డితో స్టాలిన్ కు మంచి సంబంధాలే ఉన్నాయి. అలాగని నేరుగా అధికారికంగా పంపించలేని పరిస్థితి ఎన్నికల ప్రచారానికి. ఎందుకంటే అక్కడ బిజెపి అన్నాడీఎంకె కూటమిలో కీలక భాగస్వామి. బిజెపికి ఎదురెళ్ళ లేక జగన్మోహన్ రెడ్డి మౌనంగా ఉండి పోవాల్సి వచ్చింది. అయితే మాజీ మంత్రి రోజా మాత్రం డీఎంకేకు మద్దతుగా ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం అక్కడ డీఎంకేకు ఇబ్బందికర ఫలితాలు వస్తే మాత్రం రోజా ట్రోల్స్ కు గురికావడం ఖాయం.

**వరుస ఓటములతో..**

సోషల్ మీడియా వేదికగా రోజా ఐరన్ లెగ్ ముద్ర పై ప్రచారం తెగ నడిచేది. ఎందుకంటే ఆమె టిడిపిలో ఎంట్రీ ఇచ్చేసరికి ఆ పార్టీ ఓడిపోయింది 2004లో.. 1994 నుంచి 2003 వరకు టిడిపి అధికారంలో ఉండేది ఏపీలో. ఆ సమయంలోనే రోజా తెలుగుదేశం పార్టీలోకి ఎంట్రీ ఇచ్చారు.. ఆ పార్టీ ఓడిపోయింది కూడా. 2004 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేశారు రోజా. అప్పుడు కూడా ఓటమి పలకరించింది. 2009లో రెండోసారి పోటీ చేసినప్పుడు కూడా అదే పరిస్థితి. 2014లో వైసీపీలో చేరిన ఆమె తొలిసారిగా గెలుపు అందుకున్నారు. కానీ వైసీపీ ఓడిపోయింది. అప్పటినుంచి ఆమెపై ఐరన్ లెగ్ ముద్ర ఉండిపోయింది. 2019 ఎన్నికల్లో ఆమె గెలవడంతో పాటు వైసీపీ గెలిచింది. దీంతో ఆ ముద్ర కొంత వరకు చెదిరిపోయింది. కానీ ఇప్పుడు తమిళనాడు ఎన్నికల్లో ఆమె ప్రచారం చేశారు. పొరపాటున డీఎంకేకు ప్రతికూల ఫలితాలు వస్తే రోజా ట్రోల్స్ కు గురికావడం ఖాయం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కరీంనగర్ లో దొంగల బీభత్సం...

**కొన్ని నిమిషాల ముందు తాను అదే ప్రాంతంలో ఉన్నానన్న బండి సంజయ్**

**కరీంనగర్లోని పీఎంజే జ్యువెలర్స్లో కాల్పుల ఘటన**

**దోపిడీ యత్నాన్ని అడ్డుకోవడంతో సిబ్బందిపై దుండగుల దాడి**

**ఈ ఘటనలో సేల్స్ మేనేజర్ సహా పలువురు ఉద్యోగులకు గాయాలు**

ఘటనపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి
నిందితుల కోసం పోలీసుల గాలింపు, సీసీటీవీ ఫుటేజ్ పరిశీలన

కరీంనగర్లోని పీఎంజే జువెలర్స్లో జరిగిన కాల్పుల ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన జరిగిన కొన్ని నిమిషాల ముందే తాను అదే ప్రాంతంలో ఉన్నానని, తన కార్యాలయానికి సమీపంలోనే ఈ ఘటన జరగడం బాధాకరమని ఆయన అన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని కరీంనగర్ ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, ఐదుగురు సాయుధ దుండగులు కస్టమర్ల రూపంలో జువెలరీ షాపులోకి ప్రవేశించారు. బంగారు ఆభరణాలు చూపించమని కోరారు. సిబ్బంది నగలు బయటికి తీయగానే, తుపాకులతో బెదిరించి దోపిడీకి యత్నించారు. సిబ్బంది ప్రతిఘటించడంతో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో సేల్స్ మేనేజర్తో పాటు ఇతర ఉద్యోగులు గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిని, పోలీసు అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నట్లు బండి సంజయ్ తెలిపారు. క్షతగాత్రులకు ప్రాణాపాయం లేదని, మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్కు తరలిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ పోలీసులు తక్షణమే స్పందించారని, పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారని వివరించారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, నిందితులను పోలీసులు త్వరలోనే పట్టుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

### పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని మున్సిపల్ అధికారులు

### తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ఉండలేమంటూ స్థానికుల ఆవేదన



**కూకట్ పల్లి, మే 03 (క్రైమ్ మిర్రర్) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ షంషీగూడ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ మజీద్ గల్లి లైన్ బ్లాక్ నెంబర్ 143 నివాస గృహాల మధ్య తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ముక్కుమూసుకొని ఉండాల్సిన దుస్థితి నెలకొందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత మూడు నెలలకు పైగా ఎల్లమ్మ బండ పరిసరాల్లో డ్రైనేజీ లీకేజీలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే వార్డు, మున్సిపల్ కార్యాలయంలో ఒకటికి, రెండుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం, సిబ్బంది నిర్వాకం శాపంగా మారిందని ఆ డివిజన్ ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రోడ్లపై చెత్తంతా నెలల తరబడి పేరుకపోవడంతో గాలి వీచిన సమయంలో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, అప్పుడు ఇళ్లలో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. మురికి నీరు కాలనీలో రోడ్లపైనే పొంగి పొర్లుతూ ఉండటం వలన దోమలు, పందులు, స్వైర విహారం చేయడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ దుర్గంధం కారణంగా చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని తీవ్రమైన ఆవేదన వ్యకం చేస్తున్నారు. చుట్టు పక్కల వారు సైతం రాత్రి వేళల్లో వచ్చి ఇక్కడి చెత్తను పడేసి వెళ్తున్నారని వాపోతున్నారు. ఈదురు గాలులకు చెత్తంతా ఇళ్లలోకి వస్తుండటం మరింత ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొంటున్నారు. మున్సిపల్ సంబంధిత పారిశుధ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ప్రయోజనం ఉండటం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,ఈ ప్రధాన సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ సరైన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడం, తరచుగా డ్రైనేజీ లీకేజీలు, పూడిక తీయకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. స్థానిక ప్రజలు జిహెచ్ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదని, వెంటనే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారలు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



## కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు గోపాల్ నాయక్ సన్మానించిన డిసిసి ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన పాత్లావత్ గోపాల్ నాయక్ డిసిసి ఉపాధ్యక్షులు బొలుసని భీంరెడ్డి నాయకులతో కలిసి ఆదివారం సన్మానం చేశారు. గోపాల్ నాయక్ ఇంతకుముందు కుల్కచర్ల మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా చురుకుగా పనిచేశారని వారు పార్టీకి చేసిన సేవలను గుర్తించి పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి మండల అధ్యక్షులుగా నియమించారని వారు సూచించారు. ఇంకా పార్టీకి బలంగా సేవ చేసే బాధ్యత గోపాల్ నాయక్ ఉంచారని అందుకు పార్టీ కార్యకర్తలందరూ గోపాల్ నాయక్ తో కలిసి కాంగ్రెస్ పార్టీకి పనిచేసి 2029లో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి తీసుకురావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రామచంద్రయ్య, కుల్కచర్ల మాజీ ఎంపీటీసీ సెల్మిళా ఆనందం, ఎర్రోళ్ల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇప్పాయిపల్లి వెన్నచేటి ఆనంద్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నీలా రాఘవేందర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## రెండు కార్లు ఢీకొని ఒకరు మృతి, నలుగురికి గాయాలు



**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో ఆదివారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని మల్లారెడ్డిగూడ స్టేజ్ సమీపంలోని మాము ధాబా వద్ద రెండు కార్లు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... శంషాబాద్‌లో జరిగిన పెళ్లి కార్యక్రమం ముగించుకుని చేవెళ్ల వైపు వస్తున్న బ్రిజా కారు (TS07FW3555) టైర్ ఒక్కసారిగా పేలడంతో అదుపుతప్పి రోడ్డులోని డివైడర్‌ను ఢీకొంది. అనంతరం అవతలి వైపు వెళ్లి, చేవెళ్ల నుంచి లక్ష్మీగూడ వైపు వెళ్తున్న స్విఫ్ట్ కారు (TS07HJ3220)ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారులో ఉన్న లక్ష్మీగూడ గ్రామానికి చెందిన దివాకర్ రెడ్డి (28) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి ఒక సంవత్సరం వయస్సు గల బాబు ఉన్నట్లు సమాచారం. బ్రిజా కారులో ఉన్న నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరిస్తోంది. ఈ ఘటనతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది.

## శ్రీ గంగాభవాని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



### మాజీ ఎంపీపీ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముద్దంగుల నరసింహ

**సంస్థాన్ నారాయణపురం, మే 03(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం, గంగాభవాని దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ గంగా భవాని కళ్యాణ మహోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిధులుగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి , మాజీ ఎంపీపీ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముద్దంగుల నరసింహ హాజరై కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని గంగా భవాని దేవాలయ కమిటీ వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ,వార్డు సభ్యులు మందుగుల బాలకృష్ణ,సూరపల్లి వెంకటేష్, సింగపంగ ప్రశాంతి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గునిగంటి రాజు గౌడ్, బద్దుల మురళి యాదవ్, మరగొని శంకర్ గౌడ్, యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శి కొండ నవీన్ గౌడ్, బద్దుల యాదగిరి యాదవ్, పెద్దగోనిగిరి గౌడ్, గంగాభవాని దేవాలయ కమిటీ, గంగపుత్ర సంఘం సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** నూతనకల్ మండల కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు 10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి మౌలిక వసతులు ఎంతో కీలకమని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణంతో ప్రభుత్వ దావాఖానకు వచ్చే రోగులకు గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి,, వార్డు సభ్యులు బండపెల్లి సురేందర్,గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి. ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

## వెంకటాద్రిపాలెం 33కేవీ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం

### ఇన్సులేటర్ వేడి కారణమా రూ.50 లక్షల నష్టం అంచనా

### పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత



**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 3:** మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో ఉన్న 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సబ్‌స్టేషన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడి సిబ్బంది అప్రమత్తమై వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సబ్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ఒక వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఇన్సులేటర్ అధికంగా వేడెక్కడం వల్లే అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంలో సబ్‌స్టేషన్ పాక్షికంగా దెబ్బతిన్నదని, సుమారు రూ. 50 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండొచ్చని అనధికార అంచనా. ఈ అగ్నిప్రమాదంతో వెంకటాద్రిపాలెం, జంకుతండ, శ్రీనివాస్‌నగర్, తుంగపాడు, లావుడితండా, జప్తివీరప్పగూడెం, నందిపాడు, వాటర్‌ట్యాంక్ తండా, భాగ్యగోపసముద్రం తండా, కుంటకిందితండా, ఐలాపూర్, చిల్లాపూర్, దుబ్బతండ, దీరవత్ తండా, జటావాత్ తండా, నాణ్యతండా, సీత్యతండా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటన స్థలానికి డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసాచారి, ఏడీఈ కె.రవికుమార్, ఏఈలు రవీందర్ రెడ్డి, రాంలాల్‌లు సిబ్బందితో కలిసి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. దెబ్బతిన్న పరికరాల మరమ్మతులు చేపట్టడంతో పాటు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## రైతువారంలో రైతులు చురుకుగా పాల్గొనాలి: వ్యవసాయ శాఖ ఏడీ ఋష్యేంద్రమణి

### రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు -- అధికారుల పిలుపు



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 3: రైతాంగ అభివృద్ధి లక్ష్యంగా మిర్యాలగూడ డివిజన్‌లో "ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రైతువారము కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇంచార్జి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఋష్యేంద్రమణి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని రైతులు, గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, రైస్ మిల్లర్లు, ఎరువుల డీలర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఇతర గ్రామస్థాయి అధికారులు, గ్రామ పెద్దలు, ఆదర్శ రైతులు పాల్గొననున్నారు. రైతు వేదికలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం, సన్నధాన్యం సాగు రకాలు వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే రైస్ మిల్లర్లతో చర్చా గోష్టి నిర్వహించి, నానో యూరియా వినియోగం, సన్న బియ్యం సాగుపై ప్రత్యేకంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రైతు సోదరులు అందరూ ఉదయం 10 గంటలకు తమ తమ రైతు వేదికలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్రైమ్ మిర్రర్

# ఎడిటోరియల్

సోమవారం

4-5-2026





## బిజెపికి మల్లారెడ్డి షరతు!

(మొదటి పేజీ తరువాయి)

అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గులాబీ పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ బిజెపితో ఆయన రాయబారాలు నడుపుతున్నారు. మొన్ననే తన చిన్న కోడలు ప్రీతి రెడ్డితో కలిసి బిజెపి పెద్దలను కలిశారు. దీంతో ఆయన బిజెపిలో చేరడం ఖాయమన్న ప్రచారం నడిచింది. కానీ అటువంటిదేమీ లేదని ఆయన కొట్టిపారేశారు. కానీ తెర వెనుక ఆయన భారీ ప్లాన్ తోనే బిజెపి ముందు ఒక ప్యాకేజ్ కావాలని కోరినట్లు తెలుస్తోంది. దీనిపైనే చర్చ నడుస్తోంది.

**టిడిపి ద్వారా ఎంట్రీ..**

తెలుగుదేశం పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు మల్లారెడ్డి. విద్యాసంస్థల అధినేతగా ఆయన సుపరిచితులు. అలా 2014 ఎన్నికల్లో మల్కాజ్గిరి నుంచి టిడిపి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. తరువాత గులాబీ పార్టీలో చేరి ఎమ్మెల్యే అయ్యారు. కెసిఆర్ క్యాబినెట్లో మంత్రిగా కూడా వ్యవహరించారు. మొన్నటి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మల్లారెడ్డి గెలిచారు. కానీ పార్టీ ఓడిపోయింది. అయితే ఇప్పుడు ఆయన బిజెపిలో చేరాలని సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చారు. కానీ భారీ పొలిటికల్ వ్యూహంతోనే ఆయన బిజెపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. తన ఫ్యామిలీలో ఐదుగురికి టికెట్లు ఇప్పించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే కుటుంబ రాజకీయాలకు బిజెపి వ్యతిరేకం. అక్కడే ఆయనకు ఒక ప్రతికూలత ఎదురైనట్లు తెలుస్తోంది. అందుకే బిజెపి హై కమాండ్ పిలుపు కోసం ఆయన ఎదురు చూస్తున్నట్లు సమాచారం.

**రేవంత్ అడ్డంకి..**

వాస్తవానికి మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేశారు. కానీ వర్కౌట్ కాలేదు. దానికి కారణం సీఎం రేవంత్ రెడ్డి. టిడిపిలో ఉన్నప్పటి నుంచే మల్లారెడ్డి తో రేవంత్ కు విభేదాలు ఉన్నాయి. 2014 ఎన్నికల్లో మల్కాజ్గిరి ఎంపీగా పోటీ చేయాలనుకున్నారు రేవంత్ రెడ్డి. అయితే అప్పటికే అక్కడ పోటీకి సిద్ధపడ్డారు మల్లారెడ్డి. ఆర్థికంగా స్థితిమంతుడు కావడంతో మల్లారెడ్డి వైపు అప్పట్లో చంద్రబాబు మొగ్గు చూపారు. ఈ పరిస్థితుల్లోనే అప్పట్లో రేవంత్ రెడ్డి వర్సెస్ మల్లారెడ్డి అన్నట్టు పరిస్థితి మారింది. గులాబీ పార్టీలో చేరిన తర్వాత మల్లారెడ్డి మంత్రి అయ్యారు. ఆ సమయంలో సైతం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నారు. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ లో చేరేందుకు ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా మల్లారెడ్డిని రేవంత్ అడ్డుకుంటూ వస్తున్నారు. అందుకే ఇప్పుడు రూటు మార్చి మల్లారెడ్డి బిజెపి వైపు టర్న్ అయ్యారు. కానీ బిజెపిలో చేరిక విషయంలో చిన్నపాటి సందిగ్ధతలు ఎదురవుతున్నాయి.

**ఏకంగా ఐదు సీట్లు..**

మల్లారెడ్డి ప్రధానంగా మల్కాజ్గిరి ఎంపీ సీటును తన కోడలు ప్రీతికి ఇవ్వాలని కోరుతున్నారు. తనతో పాటు ఇద్దరు కుమారులకు సైతం ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని బిజెపి హై కమాండ్ కు విన్నవిస్తున్నారు. చివరకు తన అల్లుడికి సైతం ఎక్కడో చోట సర్దుబాటు చేయాలని కోరుతున్నారు. అలా సీట్లు సర్దుబాటు చేస్తే బిజెపిలో చేరేందుకు సిద్ధమని చెప్పారు. అయితే కుటుంబంలో ఒకరికి మాత్రమే టికెట్ ఇచ్చే సంస్కృతి బిజెపిలో ఉంది. అందుకే బిజెపి హై కమాండ్ నుంచి ఒకే రాలేదని తెలుస్తోంది. మొత్తానికి అయితే మల్లారెడ్డి మాత్రం గులాబీ పార్టీని వీడి బిజెపిలో చేరడం ఖాయమన్న ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది.



## బాటిల్ వాటర్ మీరు తాగుతున్నది నీళ్ళా లేక విషమా?

**నేటి ఆధునిక సమాజంలో "శుద్ధమైన నీళ్ళు" అనే పేరుతో ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీళ్ళు అమ్మడం ఒక కోట్లాది రూపాయల వ్యాపారంగా మారిపోయింది. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, హోటళ్ళు, సినిమా హాళ్ళు, ఆసుపత్రులు ఎక్కడ చూసినా ప్లాస్టిక్ బాటిల్స్‌లో నీళ్ళు అమ్ముతున్నారు. Bisleri, Kinley, Aquafina, Bailey, Rail Neer వంటి పెద్ద కంపెనీలు రోజుకు కోట్లాది బాటిల్స్ విక్రయిస్తున్నాయి. ప్రజలు నమ్మకంగా ఈ నీళ్ళు తాగుతున్నారు కానీ ఈ ప్లాస్టిక్ బాటిల్స్ నిజంగా మన ఆరోగ్యానికి సురక్షితంగా ఉన్నాయా? ఇదే ప్రశ్న ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలను, వైద్యులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.**

భారతదేశంలో బాటిల్డ్ వాటర్ మార్కెట్ విలువ ప్రస్తుతం 20,000 కోట్లకు పైగా ఉంది. ఈ భారీ వ్యాపారం వెనుక దాగి ఉన్న అసలు నిజం ఏమిటంటే, మనం తాగే నీటితో పాటు కొన్ని ప్రమాదకరమైన రసాయనాలను కూడా పొట్టలోకి పంపుకుంటున్నాము. ప్లాస్టిక్ బాటిల్స్ తయారు చేయడానికి ఉపయోగించే ముఖ్య పదార్థం పాలిథిలిన్ టెరెఫ్తలేట్ (PET). ఈ పదార్థం తయారీ సమయంలో మరియు బాటిల్ తయారీ ప్రక్రియలో అనేక రసాయనాలను ఉపయోగిస్తారు. వాటిలో అత్యంత ప్రమాదకరమైనవి BPA (Bisphenol A), Phthalates, మరియు Antimony వంటివి. ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన ప్రధాన సమస్య "లీచింగ్" (హ్ముఎష్ట్రఱఅస్త్ర). ప్లాస్టిక్ బాటిల్స్ ఎక్కువ కాలం నిల్వ ఉంచినప్పుడు, లేదా ముఖ్యంగా ఎండలో వేడెక్కినప్పుడు (ఉదాహరణకు, సరుకులు రవాణా చేసే ట్రక్కుల్లో లేదా షాపుల ముందు ఎండలో పడేసి ఉంచినప్పుడు), ప్లాస్టిక్‌లోని రసాయనాలు నీటిలో కలిసిపోతాయి. ఒక సాధారణ వినియోగదారుడు బాటిల్ కొనే సమయానికి, ఆ బాటిల్ ఎన్ని రోజులు, ఎటువంటి ఉష్ణోగ్రతలో ఉందో తెలియదు. వేడి పెరిగే కొద్దీ, ఈ రసాయనాలు విడుదలయ్యే రేటు రెట్టింపు అవుతుంది. అంతర్జాతీయ ఆరోగ్య పరిశోధకులు ఇలా హెచ్చరిస్తున్నారు. ఒక ప్లాస్టిక్ బాటిల్ మీ చేతిలో ఉన్నప్పుడు, అది కేవలం నీళ్ళను మాత్రమే కలిగి ఉండదు వందల రసాయనాలు, సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు అందులో కలిసిపోయి మీ పొట్టలోకి ప్రయాణిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) 2019లో నిర్వహించిన ఒక సంచలనాత్మక పరిశోధన ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచవ్యాప్తంగా పరీక్షించిన 11 ప్రముఖ బ్రాండ్ల వాటర్ బాటిల్స్‌లో 93% లో మైక్రోప్లాస్టిక్ కణాలు కనుగొనబడ్డాయి. మైక్రోప్లాస్టిక్స్ అంటే ప్లాస్టిక్ యొక్క అతి సూక్ష్మమైన కణాలు (5 మిల్లీమీటర్ల కంటే తక్కువ పరిమాణం కలిగినవి). ఇవి కంటికి కనిపించవు, కానీ మన జీర్ణవ్యవస్థ ద్వారా రక్తంలోకి, ఊపిరితిత్తుల్లోకి, మరియు శరీరంలోని ఇతర అవయవాల్లోకి ప్రవేశిస్తాయి. ఇప్పటికే తల్లిపాలలో, మానవ రక్తంలో, మరియు ప్లాసెంటాలో కూడా ఈ మైక్రోప్లాస్టిక్ కణాలు కనుగొనబడ్డాయి. వీటి వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రభావాలు, అంటే కేన్సర్, రోగనిరోధక శక్తి తగ్గడం, మరియు వంధ్యత్వ సమస్యలు అన్నీ అత్యంత ప్రమాదకరమైనవి. ప్లాస్టిక్ బాటిల్ వాడకం వల్ల కలిగే ప్రమాదాలు కేవలం ఊహలు కావు, ఇవి శాస్త్రీయంగా నిరూపితమైన నిజాలు. హార్మోన్ల అసమతుల్యత ద్పూా వంటి రసాయనాలు శరీరంలో ఈస్ట్రోజెన్ వంటి హార్మోన్ల పనితీరును అడ్డుకుంటాయి. ఇది మహిళల్లో స్తన్యం, పునరుత్పత్తి సమస్యలకు, పురుషులలో సంతానలేమికి కారణం కావచ్చు. ూ్‌ఱఎశీఅం విషప్రభావం ఈ రసాయనం దీర్ఘకాలంలో కాలేయ వ్యాధులకు, మరియు చర్మ సంబంధిత సమస్యలకు దారితీయవచ్చు. పిల్లల ఎదుగుదల దశలో ఈ రసాయనాలు వారి శరీరంలోకి వెళ్లడం వల్ల మెదడు మరియు శారీరక అభివృద్ధి దెబ్బతినే ప్రమాదం ఉంది. Phthalates వంటి రసాయనాలు థైరాయిడ్ గ్రంధి పనితీరును మందగించేలా చేస్తాయి. ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తులను "100% శుద్ధం", ఆరోగ్యకరం అని పెద్ద ఎత్తున ప్రకటనలు ఇస్తున్నాయి. కానీ వాస్తవం ఏమిటంటే ఈ కంపెనీలు BPA-Free అని ప్రచారం చేసుకుంటున్నా, ఆ స్థానంలో ద్పూా (Bisphenol S), BPF వంటి ఇతర రసాయనాలను ఉపయోగిస్తున్నాయి. తాజా అధ్యయనాలు ఇవి కూడా ద్పూా తో సమానంగా లేదా అంతకంటే ఎక్కువ హానికరమని వెల్లడిస్తున్నాయి. అంతేకాదు, చాలా బాటిల్స్ మీద "ఖంవ ఖఅం ఎష్ట్రతీశీష" అని రాసి ఉంటుంది. కానీ ఈ బాటిల్స్‌ను ఎన్నిసార్లు వాడవచ్చు, అసలు ఎందుకు వాడకూడదు అన్న స్పష్టమైన హెచ్చరికలు వినియోగదారులకు అందడం లేదు. హైదరాబాద్‌కు చెందిన పర్యావరణ ఆరోగ్య నిపుణుడు డాక్టర్ రమేశ్ కుమార్ చెబుతున్నట్లుగా, ఒక PET ప్లాస్టిక్ బాటిల్ ఒకసారి మాత్రమే వాడాలని నిర్ణయించబడింది. అదే బాటిల్‌ను మళ్ళీ వాడినప్పుడు, దాని లోపలి గోడలు పాడవడం వల్ల రసాయనాలు వేగంగా నీళ్ళలో కలిసిపోతాయి. ఈ విషయం తెలిసినా, కంపెనీలు స్పష్టంగా పేర్కొనడం లేదు ఇది నిజంగా ఒక నేరపూరిత నిర్లక్ష్యం. ప్లాస్టిక్ బాటిల్స్ కేవలం మన ఆరోగ్యాన్నే కాదు, భూమిని కూడా నాశనం చేస్తున్నాయి. గణాంకాల ప్రకారం, ప్రతి సంవత్సరం ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సుమారు 5,00,000 కంటే ఎక్కువ జీవులు (సముద్ర మరియు భూచర జీవులు) మరణిస్తున్నాయి. ఒక ప్లాస్టిక్ బాటిల్ భూమిలో కలిసిపోవడానికి 400 నుండి 1000 సంవత్సరాలు పడుతుంది. సముద్రాల్లో పేరుకుపోతున్న ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు చేపల ద్వారా మళ్ళీ మన ప్లేట్లలోకి ఆహారంగా వస్తున్నాయి అంటే మనం పరోక్షంగా ప్లాస్టిక్ తింటున్నాము! భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల సంస్థ (FSSAI) కొన్ని నిబంధనలు రూపొందించినా, వాటి అమలులో చాలా లోపాలు ఉన్నాయి. బాటిల్ లేబుల్‌పై తయారీ తేదీని చాలా చిన్న అక్షరాలతో ముద్రించడం వల్ల సామాన్యులకు అది సరిగ్గా అర్థం కాదు. ముఖ్యంగా, ఎండలో ఎందుకు ఉంచకూడదు? మళ్ళీ ఎందుకు వాడకూడదు? వంటి హెచ్చరికలు తప్పనిసరి చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. యూరప్, అమెరికాలోని కొన్ని దేశాల్లో సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం మొదలైంది, కానీ 140 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో ఇంకా బాటిల్స్ అమ్మకాలపై కఠినమైన ఆంక్షలు లేవు. మనం ప్లాస్టిక్ బాటిల్స్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయడం లేదా కనిష్ఠం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది వేయవచ్చు, ఎక్కడికి వెళ్లినా స్టీల్ లేదా గాజు సీసాను వెంట ఉంచుకోండి. ఇవి ఆరోగ్యకరం, పర్యావరణ హితం. దుకాణాల్లో ఎండకు పెట్టి ఉన్న ప్లాస్టిక్ బాటిల్ నీళ్లను ఎప్పుడూ కొనకండి. ఆ నీళ్లలో విషతుల్యమైన రసాయనాలు విడుదలయ్యే అవకాశం అత్యధికం. ఒకసారి వాడిన ప్లాస్టిక్ బాటిల్‌ను మళ్ళీ మళ్ళీ నీళ్లు నింపుకోవడానికి వాడకండి. ఇది వ్యాధులను కొనితెచ్చుకోవడమే. స్కూలుకు వెళ్ళే పిల్లలకు ప్లాస్టిక్ బాటిల్స్ ఇవ్వకండి. వారి చిన్న వయసులో ఈ రసాయనాలు వారి శరీరంలో తీవ్రమైన హార్మోన్ల సమస్యలను సృష్టిస్తాయి. ఈ విషయాన్ని మీ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు చెప్పండి. అవగాహనే మనకున్న అతి పెద్ద ఆయుధం. మన పూర్వీకులు రాగి, వెండి, మరియు మట్టి పాత్రల్లో నీళ్ళు తాగేవారు. ఆ సంప్రదాయాన్ని తిరిగి గౌరవించి, ఆధునిక స్టీల్ బాటిళ్లను అలవాటు చేసుకోవడమే మనం ఆరోగ్యంగా ఉండటానికి ఉన్న ఏకైక మార్గం. ఇప్పటికైనా మేల్కొనండి! మీ నిర్ణయమే రేపటి ఆరోగ్యానికి నిదర్శనం.



డా.సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# అధికారం ఎవరిని వరించేనో!..

ఫలితాల రోజు వరకు తీవ్ర వాగ్వాదం నెలకొంది. అధికార టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ రెండూ ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. రెండు దశల్లో జరిగిన పోలింగ్ ఏప్రిల్ 29న ముగిసింది. స్వాతంత్ర్యం అనంతరం మొదటిసారి రికార్డు స్థాయిలో 92.47 శాతం ఓటింగ్ నమోదైంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఫల్తా నియోజకవర్గంలో తీవ్రమైన ఎన్నికల ఉల్లంఘనలను కారణంగా చూపుతూ ఎన్నికలను ఎన్నికల కమిషన్ రద్దు చేసింది. ఆ నియోజకవర్గంలోని మొత్తం 285 పోలింగ్ కేంద్రాలలో మే 21న రీపోలింగ్ జరగనున్నది.

**బెంగాల్‌లో హోరాహోరీ**

ప్రధాన ప్రతిపక్షం బీజేపీ నుంచి బలమైన సవాలును ఎదుర్కొన్న అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) వరుసగా నాలుగోసారి గెలవాలని ఆశిస్తుండగా 2021 ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన సీపీఎం, కాంగ్రెస్ తిరిగి పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. హుమాయున్ కబీర్ నేతృత్వంలోని ఏజేయూపీ, అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఐఎం కూడా కొన్ని కీలక ప్రాంతాలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ఇదివరకు మొత్తం 87 కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ప్రకటించగా అ సంఖ్యను 77కు తగ్గించింది. 2021లో మొత్తం 107 కౌంటింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుత కౌంటింగ్ సందర్భంగా బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఈసీ ఏర్పాటు చేసింది. కౌంటింగ్ శాంతియుతంగా, పారదర్శకంగా, క్రమబద్ధంగా జరిగేలా చూసేందుకు సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేశామని ఈసీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 165 అదనపు కౌంటింగ్ పరిశీలకులను, 77 పోలీసు పరిశీలకులను ఈసీ నియమించింది. రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు మినహా మిగతా వారికి మొబైల్ ఫోన్లను నిషేధించడం సహా లెక్కింపు కేంద్రాల వద్ద కఠినమైన ప్రవేశ నియంత్రణ చర్యలను ఈసీ ప్రవేశపెట్టింది.

**అస్సాంలో ఎన్‌డీఏ హ్యాట్రిక్?**

అస్సాంలో హ్యాట్రిక్ సాధించగలమని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ఆశిస్తున్నది. రాష్ట్రంలోని 126 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 722 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ధారించే ఈవీఎంలను 35 జిల్లాలోని 40 కౌంటింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం తెరవనున్నారు. కౌంటింగ్ కేంద్రాలు, ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత కోసం 25 కంపెనీల (ఒక్కోదానిలో దాదాపు 100 మంది సిబ్బంది) సీఆర్‌పీఎఫ్ దళాలను ఈసీ నియమించింది. రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగగా 85.96 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల బరిలో ఉన్న ప్రముఖులలో బీజేపీకి చెందిన ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ ఉన్నారు.

**ఎల్‌డీఎఫ్‌కు హ్యాట్రిక్ దక్కేనా?**

కేరళలో 2024 లోక్‌సభ ఎన్నికలు, ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికలలో తన పనితీరుతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ రెండు పర్యాయాలుగా అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్)ను గద్దె దించాలని ఆశిస్తుండగా, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ రాష్ట్రంలో పట్టు సాధించడానికి ప్రయత్నిస్తున్నది. ఎల్‌డీఎఫ్ ఓటమి పాలైతే 1960ల తర్వాత ఏ భారత రాష్ట్రంలోనూ వామపక్ష పార్టీలు అధికారంలో లేకుండాపోవడం ఇదే మొదటిసారి అవుతుంది. రాష్ట్రంలోని 140 సీట్ల కోసం మొత్తం 883 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 43 ప్రదేశాలలో 140 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పోటీలో లేనప్పటికీ 2021లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయిన బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కేరళలో తమ ఉనికిని విస్తరించుకోవడానికి ఈ ఎన్నికలను కీలకమైనవిగా భావిస్తున్నది.

**తమిళనాడులో త్రిముఖ పోటీ**

తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే, దాని ప్రధాన ప్రత్యర్థి ఏఐఏడీఎంకేతోపాటు నటుడు-రాజకీయవేత్త విజయ్ నేతృత్వంలోని టీవీకే, తమిళ జాతీయవాది సీమాన్ నేతృత్వంలోని ఎన్‌టీకే వంటి కొత్త పార్టీల భవితవ్యం మరి కొన్ని గంటల్లో తేలిపోనున్నది. వరుసగా రెండోసారి అధికారాన్ని చేపట్టాలని డీఎంకే ఆశిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 62 కౌంటింగ్ కేంద్రాల్లో మూడంచెల భద్రత నడుమ సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. ఈవీఎంల కోసం 234 కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం అదనంగా 240 హాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఏఐఏడీఎంకే, బీజేపీ, ఐఎన్‌ఆర్‌సీ, ఎల్‌జేకే పార్టీలు ఎన్‌డీఏ కూటమిలో ఉండగా కాంగ్రెస్, డీఎంకే, వీసీకే పార్టీలు ఇండియా కూటమి తరఫున బరిలో ఉన్నాయి. విజయ్ సారథ్యంలోని టీవీకే ఒంటరిగా పోటీ చేసింది.

**పుదుచ్చేరిలో విజయం ఎవరిది?**

కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఏప్రిల్ 9న ఒకే దశలో పోలింగ్ జరగగా రికార్డు స్థాయిలో 91.23 శాతం ఓట్లు పోలయ్యాయి. 2021 ఎన్నికల్లో 16 స్థానాలు గెలుచుకుని కచ్చితమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఎన్‌డీఏ మరోసారి తన అదష్టాన్ని పరీక్షించుకుంటున్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి కూడా గెలుపును ఆశిస్తున్నది.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

## కొండమడుగు నర్సింహ్మా పిలుపు



**భువనగిరి, మే 03(క్రైమ్ మిర్రర్):** ఈనెల 18, 19 తేదీలలో రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని చీమలకొండూరు గ్రామంలో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో " గోడపత్రికను " ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక కూలీ, భూమి, ఉపాధి, సంక్షేమం, విద్య, వైద్యం, కూలీ పేటలో అభివృద్ధిపై నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తూ వ్యవసాయ కూలీలకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం నిలిచిందని తెలిపారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ భూమిలేని ప్రతి పేదవాడికి ప్రభుత్వ భూములు పంచాలని కోరుతూ అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి లక్షల ఎకరాల భూములను దేశవ్యాప్తంగా పంచిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉన్నదని అన్నారు. నేడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావడంలో కూడా ఆనాడు కీలకపాత్ర పోషించిందని తెలిపారు. నేడు మోడీ బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న ఉపాధి హామీని రద్దు చేయడానికి అనేక కుట్రలు చేస్తుందని ఆ కుట్రలను నిరంతరం కూలీలను సమీకరించి తిప్పి కొడుతుందని తెలిపారు. గత మూడు సంవత్సరాల నుండి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలను, ఉద్యమాలను సమీక్షించుకొని రానున్న కాలంలో వ్యవసాయ కార్మికుల, పేదల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం ఉద్యమాలు రూపొందించడానికి ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభల సందర్భంగా 18 వ తేదీన సాయంత్రం 5 గంటలకు వందలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెకట్రాములు, ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు 18న నిర్వహించే బహిరంగ సభలో ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు, పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని, 19 నిర్వహించే ప్రతినిధుల మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం అన్ని మండలాలకు సంబంధించిన నాయకత్వం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, చీమలకొండూరు గ్రామ సర్పంచ్ పల్లెర్ల అంజయ్య, నాయకులు బోడ ఆంజనేయులు, పల్లెర్ల ఉప్పలయ్య, చంద్రయ్య, రచ్చ వెంకటేష్, నారికాడపు శంకర్, మాదాన్ జోజి, బల్ధరాజు, కరికి మల్లేష్, రావుల నాగరాజు, కడగంచి సతీష్, మంగ సత్తయ్య, అంగడి భాస్కర్, పసుల మరిదాస్, డొమినిక్, అంతోని తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌కు ఘన వీడ్కోలు



### జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా బదిలీ

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 3:** నల్గొండ జిల్లా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బదిలీ కావడంతో ఆదివారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. మిర్యాలగూడలో అమిత్ చేసిన సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవతో పాటు పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ మాట్లాడుతూ..గత 19 నెలలుగా ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నిష్పక్షపాత, బాధ్యతాయుత విధానంతో ప్రజల విశ్వాసాన్ని పొందిన అధికారిగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్‌లు అమిత్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి. వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు పి. శ్రీనివాస్, జవహర్ రాఘ్యనాయక్, పావని సరోజ, హేమలత, ఎంపీడీఓ శేషగిరిశర్మ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆడబిడ్డల పెండ్లిలకు ఆర్థిక సహాయం

### ఆదర్శంగా నిలుస్తున్న రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి (కడ్తాల్) :** కడ్తాల్ మండల కేంద్రంలోని సరికొండ గ్రామపంచాయతీకి చెందిన చిన్నావత్ ఈశ్వర్ కేలి దంపతుల కూతురు ఉమా వివాహంలో పాల్గొన్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ వధూవరులను ఆశీర్వదించి తమ వంతు సహాయంగా పట్టు చీర 21 వేల రూపాయలను వధూవరులకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మాయి తల్లిదండ్రులు చిన్న వత్ ఈశ్వర్ కేలి దంపతులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి కడ్తాల్ మాజీ జెడ్పిటిసి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్ అండగా నిలుస్తున్నారని తమ కూతురు ఉమా పెళ్లిలో పాల్గొని పట్టుచీర 21 వేల రూపాయలను అందించిన వారికి తమ కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలికోట నరసింహ గౌడ్ వార్డు సభ్యులు అంజి లాలికోట జంగయ్య గౌడ్ నీడ నరసింహ సోమ్లా నాయక్ కిషన్ నాయక్ గణేష్ నాయక్ హనుమంతు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగులతో ప్రభుత్వం రాజీ!

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకత పెరిగే అవకాశం ఉంది. దీనిని ముందుగానే గుర్తించారు సీఎం రేవంత్ రెడ్డి. అందుకే ఉద్యోగుల ఆగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నం చేశారు. తన నివాసంలో ఉద్యోగ సంఘాల నేతలతో భేటీ అయ్యారు. కీలకమైన నాలుగు సమస్యలపై పరిష్కార మార్గానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ గవర్నమెంట్ పేరుతో ప్రతి రెండు నెలలకు ఒకసారి ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం అయ్యేందుకు నిర్ణయించారు.

**భారీ ఆందోళనకు పిలుపు..**

తెలంగాణ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఈనెల ఐదున భారీ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరిగితే ప్రభుత్వంపై అసంతృప్తి, ఆపై వ్యతిరేకత ఖాయమని గుర్తించారు సీఎం రేవంత్ రెడ్డి. మొన్ననే ఆర్టీసీ సమ్మెలో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మార్పణ సంచలనంగా మారింది. వెంటనే రవాణా శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం రంగంలోకి దించి ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపారు. వారి సమ్మెను విరమింప చేసేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఉద్యోగ సంఘాల ఆందోళనలను అడ్డుకునేందుకు నేరుగా రంగంలోకి దిగారు సీఎం రేవంత్ రెడ్డి. వారి డిమాండ్లను పరిశీలించి సానుకూలత వ్యక్తం చేశారు. తప్పకుండా పరిష్కార మార్గం చూపుతానని హామీ ఇచ్చారు. దీంతో ఈ నెల ఐదున నిర్వహించ తలపెట్టిన భారీ ఆందోళనను విరమించారు ఉద్యోగ సంఘాల నేతలు.

**సుదీర్ఘ చర్చలు..**

ఉద్యోగ సంఘాల నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రధానంగా వారి రిటైర్మెంట్ బకాయిలు 6000 కోట్ల రూపాయల విడుదలకు సానుకూలత వ్యక్తం చేశారు. జూన్ 1 నాటికి ఉద్యోగుల హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను పూర్తి చేసేందుకు కూడా నిర్ణయం తీసుకున్నారు. పిఆర్సి నివేదికపై తక్షణ నిర్ణయం వంటి అంశాలతో ఉద్యోగుల్లో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించే ప్రయత్నం చేశారు రేవంత్ రెడ్డి. ఇప్పటివరకు ఉద్యోగుల సమస్యలకు సంబంధించి ప్రభుత్వానికి సలహా ఇచ్చేందుకు సరైన సలహాదారులు లేరు. అందుకే ప్రతి రెండు నెలలకు ఒకసారి ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారు. ఫ్రెండ్లీ గవర్నమెంట్ ముద్రను అలానే కొనసాగించాలని కూడా భావిస్తున్నారు. ప్రధానంగా రాష్ట్రంలో ఉద్యోగుల్లో ప్రభుత్వం పై వ్యతిరేకత తీసుకొచ్చి అసంతృప్తి పెంచాలన్నది ప్రతిపక్షాల ప్రయత్నం. అయితే ఉద్యోగుల నుంచి వచ్చే అసంతృప్తి, వ్యతిరేకత గురించి రేవంత్ రెడ్డికి తెలియంది కాదు. అందుకే ఆయన ముందుగానే మేల్కొన్నారు. ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించి సానుకూల నిర్ణయాలు వారి ముందు ఉంచారు. దీంతో వారు భారీ ఆందోళనలను తాత్కాలికంగా విరమించారు.

# శ్రీ వివేకానంద హై స్కూల్, శంకర్‌పల్లి (2003--2004 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి: శ్రీ వివేకానంద హై స్కూల్‌కు చెందిన 2003--2004 విద్యా సంవత్సరపు పదవ తరగతి విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ఎంతో ఆత్మీయంగా గెట్-టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశం ఆనందభరిత వాతావరణంలో సాగి, పాత జ్ఞాపకాలను పంచుకుంటూ అందరినీ భావోద్వేగాలకు గురి చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు తమ పాఠశాల రోజుల్ని గుర్తుచేసుకుంటూ, అప్పటి సరదా సంఘటనలు, గురువుల మార్గదర్శనం, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను స్మరించుకున్నారు. ఉపాధ్యాయులు కూడా తమ అనుభవాలను పంచుకుంటూ విద్యార్థులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ గెట్-టుగెదర్ ద్వారా పాత స్నేహ బంధాలు మరింత బలపడి, పరస్పర అనుబంధం మరింత గాఢమైంది. కార్యక్రమం చివరలో అందరూ కలిసి భోజనం చేసి, గ్రూప్ ఫోటోలు తీసుకుంటూ ఆనందంగా ముగించారు. ఈ కార్యక్రమం అందరికీ మరపురాని అనుభూతిగా నిలిచింది.

# తిరుమలలో పెరిగిన రద్దీ.. ఏటీజీహెచ్ వరకు క్యూలైన్లు

వారాంతం కావడంతో తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఇవాళ ఆదివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల ఏటీజీహెచ్ వరకు విస్తరించాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 16 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించిన వివరాల ప్రకారం, శనివారం (మే 2) ఒక్కరోజే 91,005 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 36,257 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారి హుండీ ఆదాయం రూ. 3.37 కోట్లుగా నమోదైంది. శుక్రవారంతో పోలిస్తే దర్శనానికి వచ్చిన భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో టీటీడీ అధికారులు క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. దర్శనానికి ఎక్కువ సమయం పడుతున్నందున, భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.

# ఏపీలో కొత్త రాజకీయ పార్టీ?!

(మొదటి పేజీ తరువాయి)

**దళితులను ఏకం చేసే పనిలో ఆయన ఉన్నారా?** అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో సిఐడి చీఫ్ గా పని చేశారు సునీల్ కుమార్. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో రాజకీయ ప్రత్యర్థులను వేధించారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు విషయంలో అమానుషంగా వ్యవహరించారు అన్నది ఆయనపై ఉన్న అభియోగం. ఆపై చంద్రబాబు అరెస్టు సమయంలో కూడా ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అందుకే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పివి సునీల్ కుమార్ ప్రాధాన్యత తగ్గింది. ప్రస్తుతం ఆయన వెకెంట్ రిజర్వ్ లో ఉన్నారు. ఏ పోస్టు లేకుండా ఉన్న ఆయన వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నారు. దీంతో సొంతంగానే పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**సీనియర్ ఐపీఎస్ అధికారి..**

1993 ఏపీ క్యాడర్ కు చెందిన ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్. దాదాపు 30 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పని చేశారు సునీల్ కుమార్. అంబేద్కర్ ఇండియా మిషన్ ఏర్పాటు చేసి దళితుల ఆర్థిక, సామాజిక, విద్య ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రస్తుతం అంబేద్కర్ ఇండియా మిషన్ లో పది లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఆయన రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తే మాత్రం దళితుల్లో ప్రభావం చూపగలరు. మరో నెలలో పదవీ విరమణ చేస్తున్న ఆయన రాజకీయ పార్టీ దిశగా అడుగులు వేస్తున్నట్లు ఆయన మాటల ద్వారా అర్థం అవుతుంది.

**అణగారిన వర్గాలు సంఘటితం**

సమాజంలో అణగారిన వర్గాలు, వెనుకబడిన తరగతులు సంఘటితం కావాలని పిలుపునిస్తున్నారు పివి సునీల్ కుమార్. స్వాతంత్రం వచ్చి రాష్ట్రంలో రెండు సామాజిక వర్గాలే పాలన సాగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. జనాభాలో మెజారిటీ భాగంగా ఉన్న దళితులు అధికారానికి దూరంగా ఉన్నారని చెబుతున్నారు. కాపులు సైతం రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని.. అందరం కలిస్తే విజయం ఖాయమని చెబుతున్నారు. తద్వారా ఏపీలో మరో ఫ్రంట్ దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే వైసీపీ అస్మదీయ అధికారిగా పీవీ సునీల్ కుమార్ కు పేరు ఉంది. ఇప్పుడు గాని ఆయన పార్టీని ఏర్పాటు చేస్తే కచ్చితంగా అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూరుస్తుంది. అందుకే ఆయన నోటి నుంచి కాపు అనే మాట వినిపిస్తోంది. కాపులు ప్రస్తుతం కూటమికి అండగా ఉంటున్నారు. వారు గాని యూటర్న్ తీసుకుంటే కూటమికి నష్టం. అయితే రాజకీయ పార్టీ దిశగా అడుగులు వేస్తున్న పీవీ సునీల్ కుమార్.. ఇప్పటికే తెర వెనుక ప్రణాళిక అమలు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. మరి అందులో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి.

# నన్ను డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది: సీవీ ఆనంద్ భావోద్వేగం

### కొడుకును డీజీపీగా చూడాలన్న కోరికే ఆమెను కాపాడిందని భావోద్వేగం

తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ తన తల్లిని ఉద్దేశించి భావోద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తన తల్లిని కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్న ఆయన, ఈ సందర్భంగా తన మనసులోని మాటలను పంచుకున్నారు. తన తల్లి గత నవంబర్ నుంచి జనవరి వరకు తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని, ఆ సమయంలో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. "ప్రస్తుతం అమ్మ ఆరోగ్యం మెరుగైంది, కానీ ఇంకా మంచానికే పరిమితమయ్యారు. తన కొడుకును ఈ రాష్ట్రానికి డీజీపీగా చూడాలన్న ఆమె బలమైన కోరికే, అనారోగ్యం నుంచి ఆమెను బయటపడేసిందని నేను బలంగా నమ్ముతున్నాను" అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీజీపీగా తన నియామకం గురించి తెలిసి తన తల్లి ఎంతో ఆనందపడ్డారని, ఆమె సంతోషం చూసి తానూ ఉప్పొంగిపోయానని వివరించారు. కొద్ది రోజుల క్రితమే సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాస్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

# పాకెట్ నవల్ మూవీతో ఎంతో నేర్చుకున్నా నటి మాళవికా మోహనన్

ఒంటరితనం వల్ల తాను ఎంతో బాధ పడ్డానని నటి మాళవిక మోహనన్ తెలిపారు. సోషల్‌మీడియా వేదికగా మార్చి నెల అనుభవాలను అభిమానులతో పంచుకున్న ఆమె ఈమేరకు పోస్ట్ పెట్టారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే.. త్యాగరాజన్ కుమారరాజ దర్శకత్వంలో 'పాకెట్ నవల్' కోసం వర్క్ చేయడం. అత్యుత్తమ దర్శకుల్లో ఆయన ఒకరని నిస్సందేహంగా చెప్పగలను. ఆయన మూవీ మేకింగ్ స్టైల్‌ను గమనించడం.. ఆయన మార్గదర్శకత్వంలో నటిగా నన్ను నేను మలుచుకోవడం.. కెరీర్‌పరంగా అదొక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. షూటింగ్‌లో భాగంగా నెలలో చాలా రోజులు చెన్నైలోనే గడిపా. వర్క్ మంచిగానే ఉన్నప్పటికీ ఇంటికి అంతకాలం దూరంగా ఉండటం ఊహించిన దానికంటే ఎక్కువగా కుంగదీసింది. రోజంతా కష్టపడి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒక్కదాన్నే ఉన్నాననే ఫీలింగ్ అంత సులభంగా తీసుకోలేకపోయా. నా కుటుంబసభ్యులు నన్ను చూడటానికి చెన్నై వచ్చినప్పుడు నాకెంతో ఉపశమనంగా అనిపించింది. చెన్నై, మహాబలిపు రంలోని దేవాలయాలను సందర్శించా. ఇష్టమైన భోజనం చేశా. హాయిగా సమయాన్ని ఆస్వాదించా. కొన్ని రోజుల క్రితమే ముంబయికి తిరిగివచ్చా. ఇంటికి దూరంగా ఉన్నాననే భావన నుంచి బయటకు వచ్చేందుకు సాయంత్రం వేళల్లో పడవ ప్రయాణానికి వెళ్లేదానిని అని మాళవిక రాసుకొచ్చారు.






# ఆ తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది

"చెన్నైలోని మైలాపూర్‌లో ఉన్న వారాహి అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది" అన్నారు శ్రుతీహాసన్. ఆమె తండ్రి , ప్రముఖ నటుడు కమల్‌హాసన్ నాస్తికుడు అనే విషయం తెలిసిందే. శ్రుతీహాసన్ మాత్రం 'నేను నాస్తికురాలిని కాదు... నాలో దైవ భక్తి, విశ్వాసం ఉన్నాయి' అని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. "నా జీవితంలో వారాహి అమ్మవారి ప్రభావం చాలా ఉంది. మైలాపూర్‌లో ఉన్న వారాహి అమ్మవారిని దర్శనం చేసుకున్న తర్వాతే నా కెరీర్ మలుపు తిరిగింది. మనం ఓ గుడికి వెళ్లాలని నిర్ణయించుకుని వెళతాం. అయితే దైవాలు కూడా మనల్ని ఎంచుకుంటారు. వారాహి అమ్మవారి గర్భగుడిలోకి వెళ్లగానే భక్తి పారవశ్యాన్ని పొందాను. అంతేకాదు.. ఏదో తెలియని శక్తి నన్ను ఆవహిస్తోందనిపించింది. ఆ గుడిలో వీఐపీ క్యూలు లేవు... ఆడంబరాలు లేవు. కేవలం శక్తివంతమైన



వారాహి అమ్మవారు మాత్రమే ఉన్నారు. అదే విధంగా అస్సాంలోని శక్తిపీఠం కామాఖ్య దేవాలయాన్ని కూడా సందర్శిస్తుంటాను. నాలోని మానసిక ప్రశాంతతకు, ఆత్మవిశ్వాసానికి ఆధ్యాత్మిక చింతనే కారణం అనుకోవచ్చు" అని శ్రుతీహాసన్ తెలిపారు. ప్రస్తుతం ఆమె తమిళంలో విజయ్ సేతుపతి సరసన 'ట్రైన్' మూవీలో నటిస్తున్నారు.



# ఒత్తిడిని తట్టుకునే చిట్కాలతో ముందుకు సాగుతా: శ్రీలీల


పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.

# వారణాసిలో రాముడు ఎలా ఉంటాడో?

దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'వారణాసి' అనే భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. గ్లోబల్ అడ్వెంచర్‌గా వస్తున్న ఈ సినిమా హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా.. దాదాపు వెయ్యి కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను రామాయణాన్ని టచ్ చేస్తూ ఊహకందని విధంగా.. విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నాడు రాజమౌళి. దీంతో మహేష్ బాబు రాముడి లుక్ ఎలా ఉంటుందా? అని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే వారణాసి వీడియో గ్లింప్స్ అదిరిపోయింది. తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న 'రామాయణ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తర్వాత.. వారణాసి రాముడి లుక్ రివీల్ అయితే మాత్రం.. ఇలా ఉండదని అర్థమవుతోంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్ లుక్ బాగున్నప్పటికీ.. రాజమౌళి రాముడు ఎలా ఉంటాడా అన్న ఆసక్తి మాత్రం పెరుగతోంది. ఎందుకంటే.. శ్రీరాముడి సీన్ షూట్ తర్వాత.. ఇన్ని రోజుల కష్టానికి ఈ ఒక్క షాట్ చాలు.. అని అనిపించిందని స్వయంగా మహేష్ బాబునే ఓసారి చెప్పుకొచ్చాడు. కాబట్టి.. లుక్స్ పరంగానే కాదు, విజువల్ పరంగాను వారణాసి టాప్ నాచ్ అనేలా ఉంటుందని చెప్పడంలో సందేహం అక్కర్లేదు.

# తెలుగులో తొలి ఎఐ చిత్రం... అంబ ద రివెంజ్

తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికే విధంగా.. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి ఫీచర్ ఫిల్మ్ 'అంబ' ద రివెంజ్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంకేతిక విప్లవాన్ని తెరపైకి తీసుకువస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మిస్తుండగా.. రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇక జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ లలితకళా ఫిలిమ్స్, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. పౌరాణిక ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు ఏఐ టూల్స్ వినియోగంతో విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.




# రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్

విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.